క్లుప్తంగా

పారిశ్రామిక ప్రాంతంలో హరిదాసు సందడి


హరిదాసుకు పాదాభివందనం చేస్తున్న మహిళ

మల్కాపురం: ధనుర్మాసం కావడంతో పారిశ్రామిక ప్రాంతంలో సంక్రాంతి అతిథుల సందడి మొదలైంది. డూడూ బసవన్నలు, కొమ్ము దాసరితో పాటు హరిదాసులు వాడవాడలా తిరుగుతున్నారు. శనివారం మల్కాపురం, గాంధీజీ వీధి తదితర ప్రాంతాల్లో హరినామం జపిస్తూ హరిదాసు తిరిగారు. మహిళలు ఆయనకు బియ్యం తదితర కానుకలు వేసి, పాదాభివందనం చేశారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మల్కాపురం: ధనుర్మాసం సందర్భంగా మల్కాపురం వద్ద వేంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గోవింద మాల ధరించిన భక్తులు స్థానికంగా పీఠం నెలకొల్పి, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని అర్చించారు. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్థానిక భక్తుడు అనిల్ ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు.

మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం


మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నూకరాజుయాదవ్ తదితరులు

మల్కాపురం: దేశం గొప్ప ఆర్థికవేత్తను కోల్పోయిందని కాంగ్రెస్ పార్టీ 60వ వార్డు అధ్యక్షుడు దాకరపు నూకరాజు యాదవ్ అన్నారు. గుల్లలపాలెం వద్ద శనివారం నిర్వహించిన సంతాభ సభలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు ఆయన చేపట్టిన సంస్కరణలే భారతీయ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించాయన్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో ఎస్.వెంకటరమణ, పెంటారావు, పాల్, రాజు, సత్తిబాబు, రాము తదితులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసి 18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. మూడు నెలల పాటు పెదగంట్యాడలోని న్యాక్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 8309003957 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచితంగా స్టేషనరీ, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ పూర్తి చేసిన వారికి రూ.7,500 స్టైఫండ్ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు.


రామకృష్ణ నగర్ వద్ద విస్తరించాల్సిన రహదారి


ఎన్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ గేట్‌కు సమీపంలో గతంలో వేసిన డబుల్ రోడ్

మాస్టర్ ప్లాన్ రోడ్ విస్తరణకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. కూటమి నేతలు చేసిన రాజకీయాలతో రహదారి నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. 80 అడుగుల విస్తరణ పనులు నేటికీ ముందుకు సాగకపోగా, రహదారిని కుదించేందుకు కూడా ప్రయత్నాలు చేయడం గమనార్హం

రహదారి విస్తరణకు రాజకీయ గ్రహణం

- ముందుకు సాగని 80 అడుగుల రోడ్ విస్తరణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సర్వే
- ఎన్నికల ముందు మోకాలడ్డిన కూటమి నేతలు
- తాజాగా 40 అడుగులకు కుదించే యత్నం
- భవిష్యత్ అవసరాలకు విఘాతం

విశాఖ విద్య: ఎన్ఏడీ కూడలి ఎన్ఎస్‌టీఎల్ పక్క నుంచి గోపాలపట్నం–సింహాచలం రోడ్డుకు అనుసంధానంగా చేపట్టిన 80 అడుగుల రహదారి విస్తరణ పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని జీవీఎంసీ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దీనికి అడుగులు ముందుకుపడ్డాయి. రహదారి విస్తరణ కోసమని జీవీఎంసీ జోన్–8 అధికారులు సమగ్ర సర్వే సైతం నిర్వహించారు. కానీ, ఎన్నికల్లో లబ్ధి కోసమని కూటమి నేతలు వేసిన ఎత్తుగడలతో రహదారి విస్తరణకు అప్పుడు బ్రేక్ పడింది. రహదారి విస్తరిస్తే, తమ ఇళ్లు పోతాయని కొంత మందితో ఫిర్యాదులు చేయించి, ఈ పనులకు కూటమి నేతలు అడ్డంకులు సృష్టించారు.


బాజీ జంక్షన్‌లో విస్తరించవలసిన రహదారి

అభివృద్ధి పనుల్లోనూ రాజకీయాలేనా ..!

ఎన్ఏడీ–గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్‌కు ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారి నుంచి సుసర్ల కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్, నర్సింహానగర్ మీదుగా కుమారి కల్యాణ మండపం వద్ద సింహాచలం రోడ్‌కు అనుసంధానం చేసేలా రహదారి విస్తరణ పనులు చేపట్టారు. జాతీయ రహదారి నుంచి లక్ష్మీనగర్ మూల మలుపు వరకు కిలోమీటర్ మేర 80 అడుగుల రహదారి విస్తరణ పనులు సైతం పూర్తయ్యాయి. అదేవిధంగా కుమారి కల్యాణ మండపం వైపున వంద మీటర్లు మేర రోడ్డును విస్తరించారు. అటు, ఇటు మధ్యలో ఇంకా సుమారుగా 2.5 కిలో మీటర్ల మేర రహదారి అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అప్పట్లో అధికారులు అంచనా వేశారు. కానీ, అప్పట్లో కూటమి నేతలు చేసిన రాజకీయాలతో రహదారి నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

మాస్టర్ ప్లాన్ మార్చేందుకు యత్నాలు

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జాతీయ రహదారి నుంచి ఎన్ఎస్‌టీఎల్ గోడ పక్క నుంచి సింహాచలం రోడ్‌లో గల కుమారి కల్యాణ మండపం వరకు 80 అడుగుల మేర రహదారి విస్తరించాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, మాస్టర్ ప్లాన్‌ను మార్చేలా ఇక్కడి ఓ ప్రజాప్రతినిధి ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. జాతీయ రహదారి వైపు, అదే విధంగా కుమారి కల్యాణ మండపం వైపున ఇప్పటికే 80 అడుగుల మేర రహదారి కనిపిస్తుండగా, మధ్యలో మాత్రం దీన్ని 40 నుంచి 60 అడుగులతో సరిపుచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ అవసరాల కోసమని చేపట్టే అభివృద్ధి పనుల్లో కూడా కూటమి నేతలు ఇలా రాజకీయాలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ట్రాఫిక్ కష్టాలకు మోక్షమెప్పుడో


బీఆర్‌టీఎస్ రోడ్డులో వాహనాల రద్దీ (ఫైల్)

ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వరకు గల బీఆర్‌టీఎస్ రోడ్డుపై వాహనాల రద్దీతో ప్రస్తుతం తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. బాజీ జంక్షన్ నుంచి సింహాచలం రోడ్ వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతుంటాయి. 80 అడుగుల రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని అంతా భావించారు. ఆర్టీసీ బస్టాండ్, బిర్లా జంక్షన్ నుంచి సింహాచలం వైపునకు వెళ్లేవారు ఈ దారిలో వాహనాలను మళ్లించటం ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించేది. అంతేకాకుండా ఏటా నిర్వహించే సింహగిరి ప్రదక్షిణ సమయంలో కూడా భక్తులకు ఈ రహదారి ఎంతో సౌలభ్యంగా ఉండేది. కానీ, రోడ్డు అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలిచిపోవడంతో ఎన్ఏడీ–గోపాలపట్నం దారిలో ట్రాఫిక్ కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


దుర్గానగర్‌లో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారి నుంచి దుర్గానగర్‌కి వెళ్లే మార్గంలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. దీంతో అటుగా ప్రయాణం చేసే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన సిమెంటు దిమ్మె స్థానంలో కొత్తవి వేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానికులు ఇలా టెలివిజన్ బాక్స్, ఎర్ర జెండాతో సూచిక ఏర్పాటు చేశారు. కొత్త వాహనదారులు అటుగా ప్రయాణం చేసే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పగిలిన పైపులైన్ వృథాగా పోతున్న తాగునీరు


పగిలిన పైపులైన్‌కు అడ్డుగా పెట్టిన ప్లాస్టిక్ కవర్లు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద పైపు లైన్‌కు రంధ్రం ఏర్పడింది. దీంతో మూడు రోజుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. మరిడిమాంబ ఆలయం వద్ద గల జీఏ పైపులైన్ తుప్పుపట్టడంతో దెబ్బతిని నీరు పోవడంతో కాలనీ వాసులు ప్లాస్టిక్ కవర్లను అడ్డంగా పెట్టారు.అయినా నీటి లీకేజీకి అడ్డకట్ట పడలేదు. నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించి దెబ్బతిన్న పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఉత్తమ సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి


వంశీని సత్కరిస్తున్న తహసీల్దార్ రమేష్

విశాఖ విద్య: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన ఉద్యోగులను ప్రజలు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని గోపాలపట్నం తహసీల్దార్ సి.హెచ్.వి రమేష్ అన్నారు. కార్యాలయంలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై భీమిలి ఆర్డీవో కార్యాలయానికి వెళుతున్న వంశీని శనివారం రెవెన్యూ సిబ్బంది తస్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ పనిచేసినా సమయ పాలన పాటించి సమర్థవంతంగా విధులు నిర్వహించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ బాయి, ఎన్నికల సెల్ డీటీ త్రినాథ్, ఆర్ఐ కోమలి, సర్వేయర్ రాజగోపాల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతో మోసాలకు అడ్డుకట్ట


రైతుబజార్‌లో వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న మర్రి సత్యనారాయణ

సీతంపేట : జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నరసింహనగర్ రైతుబజార్‌లో జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ మర్రి సత్యనారాయణ వినియోదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంప్రదించాల్సిన టోల్ ఫ్రీ నంబర్లపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలపై 1967 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోకుండా 1930, పోలీస్ సహాయం కోసం 100, మహిళా వేధింపులకు 112, 181, ఉచిత న్యాయం కోసం 15100, 0891 – 2575046 నంబర్లకు ఫిర్యాదు చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించిన బోర్డులను బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.కొండబాబు ఆధ్వర్యంలో పలుచోట్ల ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బజారు సహాయకుడు ఆర్.సత్యనారాయణ, వినియోగదారులు, రైతులు పాల్గొన్నారు.

డ్వాక్రా మేళాకు విశేష స్పందన


వినియోగదారులతో కిటకిటలాడుతున్న డ్వాక్రా మేళా ప్రాంగణం

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ, మెప్మా ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మైదానంలో నిర్వహిస్తున్న డ్వాక్రా ఉత్పత్తుల మేళా ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ మేళాకు నాలుగో రోజు శనివారం నగరవాసుల నుంచి విశేష స్పందన లభించింది. నగర పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులు వారు తయారు చేసిన ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జీవీఎంసీ యూసీడీ పీడీ సత్యవేణి మాట్లాడుతూ ఈ నెల 29 వరకు డ్వాక్రా మేళా కొనసాగుతుందని తెలిపారు. డ్వాక్రా సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మేళా నిర్వహించినట్లు చెప్పారు. 100 స్టాళ్ల ద్వారా విక్రయాలు జరుగుతుండగా నగరవాసులు ఉత్సాహంగా కొనుగోళ్లు చేస్తున్నారన్నారు. శనివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్యాలతో కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులకు యూసీడీ పీవో రమణమ్మ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఆనందమానందమాయె..

ఏయూక్యాంపస్: దశాబ్దాల కిందట కలసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట చేరారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం అన్నపూర్ణ ట్యుటోరియల్ కళాశాల 1998 బ్యాచ్ విద్యార్థులంతా కలిశారు. దాదాపు 26 ఏళ్ల తరువాత తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సత్కరించారు. డాబాగార్డెన్స్‌లో 1961లో ప్రారంభమైన ఈ పాఠశాలలో పదో తరగతి పూర్తిచేసిన 1998 బ్యాచ్ విద్యార్థులు తమకు పాఠాలు చెప్పిన అధ్యాపకులు ప్రసాద్, వరలక్ష్మి, సుబ్బారావు, ఎస్.లక్ష్మి, బాల సరస్వతిని సత్కరించి, వారి ఆశీస్సులు పొందారు. ఈ బ్యాచ్‌లో చదువుకుని ఐసీఎంఆర్ శాస్త్రవేత్తగా పనిచేస్తున్న డాక్టర్ సుధాకర్ అపూర్వ కలయికకు అధ్యక్షత వహించారు. ఇదే బ్యాచ్‌లో చదువుకున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సైతం పాల్గొని తన స్నేహితులతో సరదాగా గడిపారు. విదేశాల్లో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు సైతం పాల్గొని సందడి చేశారు.


అధ్యాపకులతో 1998 బ్యాచ్ విద్యార్థులు

నేడు ఫొటోగ్రఫీ శిక్షణ తరగతులు

ఏయూక్యాంపస్: విశాఖ కెమెరా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకు బీచ్ రోడ్డులోని హవా మహల్‌లో ఫొటోగ్రఫీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫొటోగ్రాఫర్, కార్యక్రమ కమిటీ చైర్మన్ బి.కె.అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిజిటల్, సెల్‌ఫోన్ కెమెరాల వినియోగం, మెళకువలు, అత్యుత్తమ ఫొటోలను తీసే విధానాలపై శిక్షణ అందిస్తామన్నారు. తక్కువ వెలుతురు ఉన్న సందర్భాల్లో సైతం మెరుగైన ఫొటోలను సాధించే విధానాలను వివరిస్తామని చెప్పారు. మోడల్స్‌తో ప్రత్యక్షంగా ఫొటోగ్రఫీలో శిక్షణ సైతం అందిస్తామన్నారు. ఫొటోగ్రఫీపై ఆసక్తి గల వారు, మెళకువలు నేర్చుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 94407 33358 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఐఎల్‌ఏ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

విశాఖ విద్య: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన ఉత్తరాంధ్ర కేడర్ కేం సమావేశంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. వర్సిటీ పాలిటిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి పేటేటి ప్రేమానందం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

డాబాగార్డెన్స్ : నగరంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, వాటి నుంచి జాగ్రత్తగా ఉండాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి సూచించారు. సైబర్ నేరాలపై సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఐఎల్ నరసింహారావుతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మహిళా వెల్ఫేర్ కార్యదర్శులు, ఎన్జీవోస్, అకౌంట్ విభాగం, ఎస్ఆర్‌యూ విభాగం, సీవోసీ విభాగాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, అందుకు సంబంధించి తమ మొబైల్ హ్యాకింగ్‌కు గురికాకుండా సరైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల వేధింపులు, సైబర్ నేరగాళ్లపై ఏ విధంగా ఫిర్యాదు చేయాలో తెలుసుకోవాలన్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్నారు


రఫ్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అప్పలరాజుయాదవ్ తదితరులు

మల్కాపురం:హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని...,వారికి కనీస వసతులు కల్పించడం లేదని విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ లేబర్ యూనియన్ (వీఐసీఎల్‌యూ)అధ్యక్షుడు దేవర అప్పలరాజుయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం రఫ్ గేటు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ లేబర్ యాక్ట్ ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం ప్రతి కార్మికుడు 8 గంటలు పని చేయాల్సి ఉందని, అదనంగా పని చేస్తే ఓటీ ఇవ్వాల్సి ఉందన్నారు. కానీ కొంత మంది కాంట్రాక్టర్లు 12 గంటలు పని చేయించుకుని కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. దీనిపై పోరాటం చేసి హక్కులను సాధించుకుంటామన్నారు.కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగు వేల కుటుంబాలకు న్యాయం చేయండి


తహసీల్దార్ భుజంగరావుకు వినతి పత్రం అందజేస్తున్న రేవళ్ల సత్యనారాయణ

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని నిరుపేదలకు గత ప్రభుత్వం 296 జీవో ద్వారా జారీ చేసి పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కు కల్పించాలని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ములగాడ తహసీల్దార్ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు.వార్డు పరిధి ములగాడ హౌసింగ్‌కాలనీలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ భుజంగరావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వార్డు పరిధిలో సుమారు 4 వేల మంది వరకు 296 జీవో ద్వారా పట్టాలను పొందిన వారు ఉన్నారని సత్యనారాయణ వివరించారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని రేవళ్ల వివరించారు.

నిఖిలలోక హృదయవాసుడు.. శ్రీనివాసుడు


ప్రవచిస్తున్న విభీషణ శర్మ


భక్తిగీతాలు ఆలపిస్తున్న మాధురి, శిరీష

ఎంవీపీకాలనీ: కష్టాలను తొలగించి, అమృత ఐశ్వర్యాలను ప్రసాదించే నిఖిలలోక హృదయవాసుడిగా కలియుగ శ్రీనివాసుడు కొలువై ఉన్నాడని ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతా రామాచార్యులు నేతృత్వంలో, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని భద్రం పార్కు వేదికగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర వైభవం ప్రవచన కార్యక్రమం శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా మూడో రోజు విభీషణ శర్మ చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. శ్రీవారిని కీర్తించడం, సేవించడం ప్రతి భక్తుడికి పూర్వజన్మ సుకృతమన్నారు. ఈ సందర్భంగా వైభవ్ సిస్టర్స్ పి.మాధురి, పి.శిరీష బృందం, రత్నమాల చిన్నారుల బృందం సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయోగశాలలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో ప్రయోగశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేలా మరింత శ్రద్ధ తీసుకుంటున్నామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. దేశ గుణాత్మక మండలిలో భాగమైన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్(ఎన్ఏబీఎల్) ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ విభాగంతో సంయుక్తంగా ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్, దాని ప్రయోజనాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏయూలోని ప్రయోగశాలలను ఎన్ఏబీఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ప్రామాణీకరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో ఏయూలో ప్రారంభించనున్న ఫుడ్ టెస్టింగ్ ఫార్మా టెస్టింగ్ లేబరేటరీలో ఎన్ఏబీఎల్ గుర్తింపును తీసుకుంటామన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి హెడ్ ప్రొఫెసర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రయోగశాలలకు ఎన్ఏబీఎల్ గుర్తింపు ఎంతో అవసరమన్నారు. ప్రామాణీకరించిన ప్రయోగ ఉపకరణాలను కలిగి ఉండడం, నాణ్యత ప్రమాణాలను కాపాడుకోవడం తద్వారా కచ్చితమైన ఫలితాలను అందించడం వీలవుతుందని చెప్పారు. ఎన్ఏబీఎల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అక్రిడిటేషన్‌పై అవగాహన కల్పించే విధానాలను వివరించారు. దేశవ్యాప్తంగా 8,500 పైగా లేబరేటరీలకు ఎన్ఏబీఎల్ గుర్తింపును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.